05-12-2022 ప్రాత:మురళి ఓంశాంతి "బాప్ దాదా" మధువనం

"మధురమైన పిల్లలూ - ఎంతగా జ్ఞాన రత్నాలను దానం చేస్తారో అంతగా ఖజానా నిండుతూ ఉంటుంది, విచార సాగర మథనము నడుస్తూ ఉంటుంది, ధారణ బాగా జరుగుతుంది"

ప్రశ్న:- ఏ ఆత్మల భాగ్యములోనైతే అనంతమైన సుఖం ఉండదో, వారి గుర్తులు ఏమిటి?

జవాబు:- వారు జ్ఞానాన్ని వింటారు కానీ బోర్లించిన కుండలా ఉంటారు. బుద్ధిలో ఏమీ కూర్చోదు. బాగుంది-బాగుంది అని అంటారు, మహిమ చేస్తారు. అవును, అందరూ ఇది వినిపించాలి, మార్గం చాలా మంచిది అని అంటారు. కానీ స్వయం దానిపై నడవరు. బాబా అంటారు, అది కూడా భాగ్యమే. పిల్లలైన మీ కర్తవ్యము, సేవ చేయడము. వేల మందికి వినిపిస్తూ ఉండండి. ప్రజలైతే తయారవుతారు. తల్లి-తండ్రి వలె అనంతమైన తండ్రి నుండి వారసత్వం తీసుకునే పురుషార్థం చేయండి. జ్ఞానాన్ని ధారణ చేసి తమ సమానముగా తయారుచేస్తూ ఉండండి.

గీతము:- భాగ్యాన్ని మేల్కొలుపుకొని వచ్చాను... (తక్దీర్ జగాకర్ ఆయీ హూ...)

ఓంశాంతి. భాగ్యం ఎల్లప్పుడూ రెండు రకాలుగా ఉంటుంది. ఒకటి మంచిది, రెండవది చెడ్డది. ఒకటి సుఖానికి సంబంధించినది, రెండవది దుఃఖానికి సంబంధించినది. భారత్ కు సుఖము యొక్క భాగ్యము కూడా ఉంది, అలాగే దుఃఖం యొక్క భాగ్యము కూడా ఉంది. భారత్ యే సుఖధామముగా ఉండేది, భారత్ యే దుఃఖధామముగా ఉంది. ఇల్లు కొత్తగా ఉంటే అది మంచి భాగ్యము, పాతదిగా ఉంటే అది చెడు భాగ్యము. భారత్ యే మొదట కొత్తగా ఉండేది, ఇప్పుడు మళ్ళీ పాతదిగా అయిపోయింది. ఈ విషయాలను కూడా పిల్లలైన మీరే అర్థం చేసుకోగలరు, ప్రపంచానికి తెలియదు. మీ ధ్యానము ఈ విషయాల వైపుకు మరల్చడం జరుగుతుంది, పిల్లలూ - మీరు ఎంత అదృష్టవంతులుగా ఉండేవారు. దేవీ-దేవతలు విశ్వానికి యజమానులుగా ఉండేవారు, ఇప్పుడు లేరు. మంచి భాగ్యము మారి ఇప్పుడు చెడుగా అయిపోయింది. మంచి భాగ్యము ఎలా ఉంటుంది మరియు ఎప్పుడు ఉంటుంది, ఇది అర్థం చేసుకోవలసిన విషయము. అర్థం చేయించేవారు ఒక్క అనంతమైన తండ్రి మాత్రమే. భారత్ యొక్క ఉన్నతమైన భాగ్యము ఎప్పుడు ఉండేది? స్వర్గముగా ఉన్నప్పుడు. చెడు భాగ్యము ఇప్పుడు ఉంది. ఓ పతిత పావనా, వచ్చి మా పావన భాగ్యాన్ని తయారుచేయండి అని పాడుతారు కూడా. భారత్ పావనంగా ఉండేది, అప్పుడు గొప్ప భాగ్యము ఉండేది. ఇప్పుడు అదే భారత్ పతితముగా ఉంది ఎందుకంటే వికారులుగా ఉన్నారు. వికారులు మరియు నిర్వికారులు ఇరువురూ ఉంటారు. మనం ఒకవేళ ఈ సమయంలో నిర్వికారిగా అయినట్లయితే దేవతలుగా అవుతాము. ఇప్పుడు తండ్రిని పిలుస్తూ ఉంటారు. కుంభ మేళాలలో కూడా పతిత-పావనా సీతారామ... అని తప్పకుండా పాడుతూ ఉంటారు. నది అయితే పతిత-పావని కాదు. మనుష్యుల భాగ్యం ఎప్పుడైతే పాడవుతుందో, అప్పుడు ఎంత రాతిబుద్ధి కలవారిగా అయిపోతారు. ఇది దుఃఖము మరియు సుఖము యొక్క ఆట. దుఃఖము ఎవరు ఇస్తారు? సుఖము ఎవరు ఇస్తారు? ఇరువురి చిత్రాలు చాలా ప్రసిద్ధమైనవి. సుఖము కోసం పరమపిత పరమాత్మను స్మృతి చేస్తారు. ఓ దుఃఖహర్త, సుఖకర్త అని అంటారు. కావున దీని ద్వారా తండ్రి ఎప్పుడూ దుఃఖాన్ని ఇవ్వరని నిరూపించబడింది. భగవంతుడే సుఖ-దుఃఖాలు రెండింటినీ ఇస్తారని వారు భావిస్తారు. పైసా అంత విషయాన్ని కూడా ఎవరూ అర్థం చేసుకోరు. ఇప్పుడు మిమ్మల్ని తండ్రి పారసబుద్ధి కలవారిగా తయారుచేసారు, బుద్ధి తాళాన్ని తెరిచారు. సృష్టి చక్రము తిరుగుతూ ఉంటుందని మీకు తెలుసు. సృష్టి పాతదిగా అయితే అందులో దుఃఖము ఉంటుంది. ఇప్పుడు మీకు 3 కళ్ళు లభించాయి. మీరు అందరికీ అర్థం చేయించవచ్చు, పతిత-పావనా రండి, అని పాడుతున్నప్పుడు మరి నదుల వద్దకు వచ్చి ఎందుకు కూర్చున్నారు? ఈ యజ్ఞ తపాదులు మొదలైనవి చేయడం, వేద శాస్త్రాలు మొదలైనవి చదవడం అన్నీ భక్తి మార్గము. తండ్రి అంటారు - నేను వీటి ద్వారా లభించను, ఎప్పుడైతే మీ భక్తి పూర్తవుతుందో, అప్పుడు నేను వచ్చి సద్గతిని ఇస్తాను. యోగం యొక్క జ్ఞానం కూడా కావాలి. పావనంగా అయ్యేందుకు కూడా జ్ఞానం కావాలి. శాస్త్రాలను చదవడం ద్వారా పావనంగా అయ్యే విషయమేమీ ఉండదు. వివేకం చెప్తుంది, భారత్ ఎప్పుడైతే పావనంగా ఉండేదో, సంపూర్ణ నిర్వికారిగా ఉండేదో, అప్పుడు చాలామంది ధనవంతులు కూడా ఉండేవారు. ఇటువంటి ధనవంతులుగా మరియు పవిత్రంగా ఎవరు తయారుచేసారు? గంగా స్నానాలు చేయడం వలన అయ్యారా లేక శాస్త్రాలను చదవడం వలన అయ్యారా? ఇదైతే మీరు చేస్తూనే వచ్చారు అయినా కూడా, ఓ పతిత పావనా రండి, అని పిలుస్తారు. ఎప్పుడైతే పతిత ప్రపంచం యొక్క సమయం పూర్తవుతుందో అప్పుడే పతిత పావనుడైన తండ్రి వచ్చి స్వర్గ స్థాపన చేస్తారు.

పావన ప్రపంచము సత్యయుగము, పతిత ప్రపంచము కలియుగము. పతిత పావనుడు పరమాత్మ ఒక్కరేనని ఎవరూ అర్థం చేసుకోరు. పతిత-పావనా సీతారామ... అని పాడుతారు. దాని అర్థాన్ని కూడా తండ్రే అర్థం చేయిస్తారు, సీతలందరికీ రాముడు పరమాత్మ ఒక్కరే. రాముడు అందరికీ దాత అని అంటారు. వారు ఏ దాత? దీనిని కూడా అర్థం చేసుకోరు. తండ్రి అర్థం చేయిస్తారు, అందరికీ దాత అయిన రాముడు నిరాకారుడు ఒక్కరే. బుద్ధికి పూర్తిగా తాళం వేయబడి ఉంది. బుద్ధిలో కూర్చొనే కూర్చోదు. సత్యయుగములో అందరూ పారసబుద్ధి కలవారిగా ఉంటారు, పేరే ఉంది పారసనాథ్, పారసపురి. పిల్లలైన మీరు కూడా ఈ సమయంలో పారసనాథులుగా అవుతారు. ఆత్మ స్వర్ణిమ యుగానికి చెందినదిగా అవుతుంది. ఇప్పుడు ఇనుప యుగపు బుద్ధిగా ఉంది. స్వర్ణిమయుగ బుద్ధి సుఖాన్ని స్వీకరిస్తుంది, ఇనుప యుగపు బుద్ధి దుఃఖాన్ని స్వీకరిస్తుంది. మనుష్యులు విషం వెనుక హైరానా పడతారు. పవిత్రముగా అవ్వడంలో చూడండి, ఎన్ని హంగామాలు చేస్తారు. కంసుడు, జరాసంధుడు, దుశ్శాసనుడు, పూతన, శూర్పణఖ... అని అంటూ ఉంటారు కూడా. ఇవన్నీ గతించిన విషయాల గురించి గాయనము. తప్పకుండా ఇది సంగమయుగం యొక్క గాయనమే. ప్రతి విషయము సంగమము గురించే చెప్పబడుతుంది. తండ్రి అంటారు - నేను కూడా పతితులను పావనంగా చేయడానికి ఒక్కసారే వస్తాను. మీకు తెలుసు, పతితులను పావనంగా చేయడమే బాబా వ్యాపారము. తండ్రి రచయిత, మరి తప్పకుండా కొత్త రచననే రచిస్తారు. రావణుడు పతితముగా చేసేవాడు. తండ్రి పావనంగా చేసేవారు. వారి యథార్థమైన పేరు శివ. శివరాత్రిని కూడా జరుపుకుంటారు. రాత్రి యొక్క అర్థాన్ని కూడా మీరు అర్థం చేసుకున్నారు. ఎప్పుడైతే భక్తి అనగా రాత్రి పూర్తయి పగులు వస్తుందో అప్పుడే తండ్రి వస్తారు.

ఇప్పుడు తండ్రి అంటారు, పిల్లలూ, పావనంగా అవ్వండి. ఇప్పుడు తిరిగి వెళ్ళాలి. సత్యయుగము ఒకప్పుడు ఉండేది, ఇప్పుడు మళ్ళీ చక్రము రిపీట్ అవుతుంది. పిల్లలైన మిమ్మల్ని మనుష్యుల నుండి దేవతలుగా తయారుచేస్తున్నాను. దేవతలు కూడా మనుష్యులే, ఇంకే తేడా లేదు. కేవలం వారు తెల్లగా అనగా పావనంగా ఉండేవారు మరియు ఇప్పటి మనుష్యులు నల్లగా అనగా పతితులుగా ఉన్నారు. భారత్ స్వర్ణిమ యుగముగా ఉండేది, ఇప్పుడు ఇనుప యుగముగా ఉంది. ఆత్మలో మాలిన్యం చేరుకుంది - అది యోగాగ్నితో తొలగుతుంది. ఇంతకుముందు మన్మనాభవ అన్న పదాన్ని చదివేవారు. అర్థమేమీ అర్థం చేసుకునేవారు కాదు. పరమపిత పరమాత్మతో బుద్ధి యోగం జోడించాలి, కానీ వారి రూపం గురించే ఎవ్వరికీ తెలియదు మరి యోగం ఎలా జోడింపబడగలదు. పరమాత్మ నామ రూపాలకు అతీతమైనవారు అని అంటారు, మరి యోగం ఎవరితో జోడించాలి? భగవానువాచ - మన్మనాభవ. దేహ అభిమానాన్ని విడిచిపెట్టండి, స్వయాన్ని ఆత్మగా భావించండి. ఆత్మ రూపమేమిటి? ఆత్మ ఒక నక్షత్రము. భృకుటి మధ్యలో ఉంటుందని అంటారు. మరి ఆత్మల తండ్రి కూడా అలాగే ఉంటారు. వారిని మళ్ళీ నామ రూపాలకు అతీతమైనవారు అని అంటారు. తండ్రి కోసం, బ్రహ్మము, అఖండ జ్యోతి తత్వము అని అంటారు. బ్రహ్మమైతే అంతం లేనిది అయినట్లు. ఎలాగైతే ఆకాశం యొక్క అంతాన్ని పొందలేరు. అచ్ఛా, ఎవరైనా అంతాన్ని పొందవచ్చు కూడా. కానీ దాని వలన ముక్తి-జీవన్ముక్తి అయితే ఎవరికీ లభించవు. ముక్తి-జీవన్ముక్తుల యొక్క అర్థము కూడా పిల్లలైన మీరే అర్థం చేసుకుంటారు. ప్రపంచానికైతే ఏమీ తెలియదు. జ్ఞాన సాగరుడు, మనుష్య సృష్టికి బీజ రూపుడు అని గానం చేస్తారు కూడా. సత్యం, చైతన్యము, పతిత పావనుడు అయినప్పుడు తప్పకుండా పతిత ప్రపంచములోకే వస్తారు. మీరు అర్థం చేయిస్తారు, ఎప్పుడైతే జ్ఞానం ఉంటుందో అప్పుడు భక్తి ఉండజాలదు. జ్ఞానం పగలు సత్య, త్రేతాయుగాలు. భక్తి రాత్రి. జ్ఞాన సాగరుడు పరమపిత పరమాత్మ, అంతేకానీ నీరు కాదు - ఇది అందరికీ అర్థం చేయించాలి. మొత్తం భారత్ కు సందేశాన్ని ఎలా ఇవ్వాలి, దీని కోసం బాబా మంచి మంచి యుక్తులను అర్థం చేయిస్తూ ఉంటారు. వాస్తవానికి మేళా అయితే ఆత్మ మరియు పరమాత్మ గురించే అంటూ ఉంటారు. పరమాత్మ అయితే ఒక్కరే. పరమాత్మ సర్వవ్యాపి - ఈ లెక్క ఏమీ వర్తించదు. తండ్రే వచ్చి అందరినీ దుఃఖాల నుండి విడిపిస్తారు. దుఃఖములో అందరూ స్మరిస్తారు. ఎంతగా దుఃఖముతో మొరపెట్టుకుంటూ ఉంటారు. ఇవి ఎప్పటి నుండి చేస్తూ వచ్చారు? అని అడగండి. పరంపరగా చేస్తున్నాము అని అంటారు. పావనంగానైతే ఎవరూ అవ్వలేదు ఇంకా పతితంగా అవుతూ వచ్చారు.

మీ బుద్ధిలో ఇప్పుడు జ్ఞానమంతా నిండి ఉంది. జ్ఞానాన్ని బ్రహ్మ పగలు అని అంటారు. విష్ణు పగలు అని అనరు ఎందుకంటే జ్ఞానం ఇప్పుడే లభిస్తుంది. రోజు రోజుకు రిఫైన్ పాయింట్లు వెలువడుతూ ఉంటాయి. జీవన్ముక్తి కూడా ఒక్క క్షణం యొక్క విషయము, మళ్ళీ అంటారు, వారు జ్ఞాన సాగరుడు, ఎంతగానైనా రాస్తూ వెళ్ళండి దాని అంతము రాదు. తండ్రి ఎప్పుడైతే అర్థం చేయించి పూర్తి చేస్తారో అప్పుడు మళ్ళీ పరీక్షలు కూడా పూర్తయిపోతాయి. ప్రారంభం నుండి మొదలుకొని ఎంతగా వింటూ వచ్చారు. గీతనైతే చాలా చిన్నగా తయారుచేసారు. జ్ఞానం యొక్క విషయాలు ఎన్ని ఉన్నాయి. అర్థం చేయించడం కూడా చాలా సహజము. తప్పకుండా సత్యయుగములో ఒకే ధర్మం ఉండేది. ఇప్పుడైతే

ఎన్ని ధర్మాలు ఉన్నాయి. ఎన్ని హంగామాలు ఉన్నాయి. పరస్పరములోనే గొడవలు ఏర్పడ్డాయి. ఒకే ధర్మం ఉన్నప్పుడు యుద్ధం మొదలైనవాటి పేరు ఉండేది కాదు, సుఖమే సుఖము ఉండేది. చక్రము యొక్క రహస్యము బుద్ధిలో ఉంది. మీరు 84 జన్మలు ఎలా తీసుకుంటారో పిల్లలకు అర్థం చేయించారు. చక్రము రిపీట్ అవుతుంది. ఇప్పుడు మీరు తమోప్రధానము నుండి సతోప్రధానముగా యోగబలము ద్వారా అవుతున్నారు. మీరు ఇప్పుడు ఆస్తికులుగా అయ్యారు. త్రికాలదర్శులుగా కూడా అయ్యారు. ప్రపంచములో ఇంకెవ్వరికీ రచయిత మరియు రచన గురించి తెలియదు. పిల్లలైన మీకే తెలుసు కానీ ధారణ చేసి ఇతరులకు అర్థం చేయించకపోతే పాయింట్లు మర్చిపోతారు. ఒక సంపద బుద్ధిలో కూర్చోకపోతే మరొకటి ఎలా కూర్చుంటుంది. దానం ఇస్తూ వెళ్ళినట్లయితే ఖజానా నిండుతూ ఉంటుంది. ఎవరికి ఎలా అర్థం చేయించాలి అని విచార సాగర మథనం నడుస్తూ ఉంటుంది. ఎప్పుడైతే జ్ఞానం ఉండదో అప్పుడు భక్తికి మహిమ ఉంటుంది. ఎవరైతే సేవలో ఉంటారో వారి బుద్ధిలో నషా ఉంటుంది. నంబరువారుగా అయితే ఉన్నారు. మహారథులు ఎవరంటే, ఎవరైతే ఇతరులను తమ సమానముగా తయారుచేస్తూ ఉంటారు. జ్ఞానాన్ని ధారణ చేస్తారు. పదవి కూడా వారికి అటువంటిదే లభిస్తుంది. ఈ శ్రమ అంతా గుప్తమైనది. మీరు తండ్రికి చెందినవారిగా అయ్యారు కావున తండ్రి నుండి తప్పకుండా స్వర్గం యొక్క వారసత్వము లభిస్తుందని భావిస్తారు. అక్కడ రావణుడు ఉండడు. రావణుడి రాజ్యమే వేరు, రామరాజ్యం వేరు. పిల్లలైన మీరు ఇప్పుడు అర్థం చేసుకున్నారు, రామాయణము, భాగవతము మొదలైనవాటిలో అన్నీ ఈ సమయానికి సంబంధించిన విషయాలే ఉంటాయి. ఇవి బొమ్మల ఆటలు. తండ్రి అర్థం చేయిస్తారు, ఈ సమయంలో మొత్తం వృక్షమంతా తమోప్రధానముగా ఉంది. సమాప్తమవ్వనున్నది. మీ బుద్ధిలో రహస్యమంతా ఉంది. అర్థం చేయించేందుకు ఎన్ని యుక్తులను తెలియజేస్తూ ఉంటారు. అయినా కూడా కోట్లలో కొందరే అర్థం చేసుకుంటారు, అంటు కట్టబడుతోంది. ఎవరైతే ఇతర ధర్మాలలోకి కన్వర్ట్ అయిపోయారో వారందరూ బయటకు వస్తారు. హిందువులు వాస్తవానికి దేవీ దేవతా ధర్మానికి చెందినవారు. భారతవాసులైన మీరు దేవీ దేవతా వంశావళికి చెందినవారు కదా అని అర్థం చేయించాలి. దేవీ దేవతలను పూజిస్తారు. దేవతా ధర్మమే మీ ధర్మం. మొదట మీరు దేవతలుగా ఉండేవారు, ఆ తర్వాత మీరు క్షత్రియులుగా, వైశ్యులుగా, శూద్రులుగా అయ్యారు. ఇప్పుడు మీరు మళ్ళీ బ్రాహ్మణులుగా అయి దేవతలుగా అవ్వండి. మేము భారతవాసులకే అర్థం చేయిస్తాము. ఇప్పుడు అంటు కట్టబడుతుంది. నేను శూద్రుల నుండి ఎలా కన్వర్ట్ చేస్తాను అన్నది తండ్రి కూర్చొని అర్థం చేయిస్తారు. బ్రాహ్మణులుగా అయి మళ్ళీ దేవతలుగా అవుతారు. ఇది ఎంత మంచి వివరణ. శాస్త్రాలను చదివారా అని మిమ్మల్ని ఎవరైనా అడిగితే వారికి చెప్పండి, భక్తి మార్గంలో శాస్త్రాలన్నింటినీ చదివాము, కానీ సద్గతి అయితే తండ్రే వచ్చి ఇస్తారు, అందుకే మీరు వారిని ఓ పతిత పావనా రండి, అని పిలుస్తారు కదా. యుక్తిగా అర్థం చేయిస్తే తప్పకుండా అర్థం చేసుకుంటారు. అర్థం చేయించేందుకు పిల్లలలో ధైర్యం కావాలి. డ్రామా మీ చేత సేవ చేయిస్తుంది - ఈ విధంగా కనిపిస్తుంది. కల్ప క్రితము కూడా వీరు ఇంత పురుషార్థము చేసి ఈ పదవిని పొందారు, బాబా నుండి వారసత్వాన్ని పొందేందుకు పురుషార్థము పూర్తిగా చేయాలి. తండ్రి వారసత్వము లభిస్తుంది అన్నప్పుడు మనం రావణుడి వారసత్వాన్ని ఎందుకు ముట్టుకోవాలి? మధురంగా ఎందుకు అవ్వకూడదు. సర్వగుణ సంపన్నులుగా అవ్వాలి. ఇది నరుని నుండి నారాయణునిగా అయ్యే రాజయోగము అనగా రాజ్యం పొందే యోగము.

తండ్రి అంటారు, నేను కల్ప కల్పము, కల్పము యొక్క సంగమయుగములో వస్తాను. ఇది ఎక్కే కళ యొక్క యుగము. మిగిలినవన్నీ దిగే కళ యొక్క యుగము. దిగే కళ మరియు ఎక్కే కళ ఉంటుంది. ఈ చక్రము బుద్ధిలో ఉంటుంది. తండ్రి కూర్చొని ఆత్మలతో (పిల్లలతో) మాట్లాడుతారు - నన్ను స్మృతి చేయండి. ఈ అంతిమ జన్మ పతితంగా అవ్వకండి, తద్వారా నేను మిమ్మల్ని విశ్వానికి యజమానులుగా తయారుచేస్తాను. మీరు నా మాటను వినరా? అలా అయితే అనంతమైన సుఖాన్ని కూడా మీరు పొందలేరు. మీరు ఈ జన్మ అయితే పవిత్రంగా అవ్వండి. నేను గ్యారంటీ ఇస్తాను, మిమ్మల్ని విశ్వానికి యజమానులుగా తయారుచేస్తాను. తండ్రి మాటను కూడా వినరా ఏమిటి? ఎవరైతే పుష్పాలుగా అయ్యేవారు ఉంటారో వారికి వెంటనే బాణం తగులుతుంది. భాగ్యములో లేకపోతే బోర్లించిన కుండ వలె వింటారు. ప్రదర్శనీలో మీరు ఎంతమందికి అర్థం చేయిస్తారు, బాగుంది-బాగుంది అని అంటారు. మార్గం చాలా సహజమైనది అని అంటారు, కానీ స్వయం ఏమీ చేయరు. కేవలం మహిమ చేసి ఇతరులతో బాగుంది అని అన్నారు, కానీ స్వయం నడవలేదు అంటే, దాని వలన ఏముంటుంది. భాగ్యములో లేదు అని అంటారు. ఇలాంటి-ఇలాంటి వారు ప్రజలలోకి వస్తారు. కానీ పిల్లలలో సేవ యొక్క అభిరుచి ఉండాలి. వేల మందికి వినిపించవలసి ఉంటుంది. అనంతమైన తండ్రి నుండి వారసత్వం తీసుకునేందుకు తల్లి తండ్రి వలె పురుషార్థం చేయాలి. అచ్ఛా!

మధురాతి-మధురమైన సికీలధే పిల్లలకు మాత-పిత బాప్ దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్ మార్నింగ్. ఆత్మిక

పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

ధారణ కొరకు ముఖ్య సారము:-

1. తండ్రి నుండి పూర్తి వారసత్వాన్ని తీసుకునేందుకు అతి మధురముగా, సర్వగుణ సంపన్నముగా అవ్వాలి. రావణుని వారసత్వాన్ని ముట్టుకోకూడదు.

2. జ్ఞానాన్ని ధారణ చేసి ఆత్మిక నషాలో ఉంటూ సేవ చేయాలి. అనంతమైన సుఖము పొందేందుకు తండ్రి యొక్క ప్రతి సలహాను అంగీకరించి దానిపై నడవాలి.

వరదానము:- అటెన్షన్ అనే విధి ద్వారా మాయ యొక్క నీడ నుండి స్వయాన్ని సురక్షితంగా ఉంచుకునే అలజడిలో అచలంగా కండి

వర్తమాన సమయము ప్రకృతి యొక్క తమోగుణీ శక్తి మరియు మాయ యొక్క సూక్ష్మమైన రాయల్ తెలివి యొక్క శక్తి తమ కార్యాన్ని తీవ్ర వేగంతో చేస్తున్నాయి. పిల్లలు ప్రకృతి యొక్క భయంకరమైన రూపాన్ని తెలుసుకుంటారు కానీ మాయ యొక్క అతి సూక్ష్మ రూపాన్ని తెలుసుకోవడములో మోసపోతారు ఎందుకంటే మాయ రాంగ్ ను కూడా రైట్ గా అనుభవం చేయిస్తుంది, రియలైజేషన్ శక్తిని సమాప్తం చేసేస్తుంది, అసత్యాన్ని సత్యమని నిరూపించడములో తెలివైనవారిగా చేసేస్తుంది అందుకే ''అటెన్షన్'' అనే పదాన్ని అండర్ లైన్ చేసి మాయ యొక్క నీడ నుండి స్వయాన్ని సురక్షితంగా ఉంచుకోండి మరియు అలజడిలో కూడా అచలంగా అవ్వండి.

స్లోగన్:- ప్రతి సంకల్పంలో ఉల్లాస-ఉత్సాహాలు ఉన్నట్లయితే సంకల్పం యొక్క సిద్ధి జరిగేదే ఉంది.